క్లుప్తంగా

వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ సేల్స్ రూ. కోటి



మార్ట్‌ను పరిశీలిస్తున్న వైకేపీ ఏపీఎం శ్రీనివాసులు

బేతంచెర్ల: అందరి సహకారంతోనే వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ సేల్స్ కోటి రూపాయలకు చేరుకుందని వైకేపీ ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఏపీఎం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్ట్‌లో పొదుపు మహిళలతో పాటు అందరికీ నాణ్యమైన సరుకులను, సరసమైన ధరలకు అందుబాటులో ఉంచినందున అమ్మకాలు పెరిగాయన్నారు. మార్ట్ ఏర్పడిన ఎనిమిది నెలల్లో కోటిరూపాయలకు చేరుకోవడం సంతోషకరమని, మార్ట్ సిబ్బందిని, మండల సమాఖ్య లీడర్లను అభినందించారు. కార్యక్రమంలో మార్ట్ ఇన్‌చార్జ్ రామ సుంకడు, సీసీ రామకృష్ణ తదితులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ కోట్రికె హరికిషన్

డోన్: ప్రజలకు మౌలిక వసతుల కల్పించేందుకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రాధాన్యనిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్ తెలిపారు. స్థానిక 20వ వార్డులో శనివారం రూ.20లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోయ కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, నాగరాజు, అశోక్, పెండేకల్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కోవెలకుంట్ల: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు వర్తింప చేస్తున్నాయని సర్పంచ్ బాలమద్దిలేటి అన్నారు. శనివారం మండలంలోని అమడాల గ్రామంలో వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్డీ రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, డాక్టర్ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శంకరయ్య, గ్రామ సచివాలయ కన్వీనర్ భారతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు పాటుపడ్డాయన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాములు



బనగానపల్లె : అయ్యప్ప స్వాములు శనివారం శబరిమలకు బయలుదేరాలరు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డితో పాటు దాదాపు 50 మంది అయ్యప్ప మాలధారులు ఇరుముడి ధరించి శబరిమలై వెళ్లారు. ముందుగా వీరు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఇరుముడులు ధరించి బ్రహ్మంగారి మఠం వరకు కాలినడకను వెళ్లి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పూజ కార్యక్రమంలో కాటసాని ప్రసాదరెడ్డి సతీమణి కాటసాని సులోచన, తనయుడు కాటసాని వెంకటసాయి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న హిందూ ధర్మ సమ్మేళనం

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంలో సమరసతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమరసత సేవాఫౌండేషన్ నంద్యాల జిల్లా సహకన్వీనర్ నాగమోహన్, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ బాలీశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆంజనేయస్వామి ఆలయంలో సమరసత సేవాఫౌండేషన్ పట్టణ, మండల కన్వీనర్లు రాజేష్, బుగ్గన విశ్వనాథ్ రెడ్డి, భారతీయ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షులు హుసేన్‌రెడ్డి, సురభి గోశాల ట్రస్ట్ మారుతి కృష్ణ ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళనం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పూదోట మఠం అధ్యక్షులు గుండా గోపాలు, హిందూ సోదరులు మధు మోహన్ రెడ్డి, రవి శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటకు చెందిన రాజారాం కుమారుడు మాణిక్యం ఈ నెల 1 నుంచి కన్పించడం లేదని శనివారం తండ్రి ఫిర్యాదు చేశారని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మాణిక్యం ప్రవేట్ కంపెనీలు ఉద్యోగం చేస్తున్నాడు. కొన్నినెలల క్రితం మాణిక్యానికి ఇన్‌స్టాగాంలో అమ్మాయితో పరిచయం అయ్యింది. ఆ అమ్మాయి ఈ నెల 1వ తేదీ ఉదయం డోన్‌కురాగా మాణిక్యం ఇంటికి తీసుకొచ్చాడు. తల్లి ఇంటిలోకి రావద్దని చెప్పడంతో ఇద్దరూ బయటకు వెళ్లారు. అయితే మాణిక్యం సెల్ స్విచ్ఛాఫ్ రావడం, నేటికీ ఏ సమాచారం లేకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ప్రజారోగ్యం పదిలం!

- టీకాతో టీబీ కట్టడికి సిద్ధమైన అధికారయంత్రాగం
- కరోనా వ్యాక్సిన్‌లా అందజేసేందుకు ప్రణాళికలు
- వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది
- ఆరు కేటగిరిల వ్యక్తులకు ప్రాధాన్యం



చిన్నమల్కాపురం గ్రామ సచివాలయంలో వివరాలను అప్‌డేట్ చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

డోన్ రూరల్ : ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇళ్ల వద్దనే రోగులకు వైద్య సేవలు అందజేస్తుంది. అదేవిధంగా గ్రామగ్రామాన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి అన్ని వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీబీ (క్షయ) కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ప్రజల ప్రాణాలు హరిస్తున్న టీబీపై టీకాతో పోరుకు ప్రణాళికల రూపొందిస్తుంది వైఎస్సార్‌సీపీ సర్కార్. క్షయ ఒకరి నుంచి మరోకరికి సులువుగా, వేగంగా వ్యాప్తి చెందే వ్యాధి. దీంతో ముందస్తు జాగ్రత్తల చర్యలతో ఆరికట్టేందుకు జిల్లా వైద్యశాఖ కసరత్తు చేస్తోంది. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచణ ప్రణాళిక రూపొందించింది. సచివాలయ వ్యవస్థ ద్వారా టీకాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఆరు కేటగిరిలకు సంబంధించిన వ్యక్తుల వివరాలు సేకరిస్తున్నారు. వీరికి ఈ నెలలోనే బాసిల్లస్ కాల్మెట్ –గ్యారిన్ (బీసీజీ) టీకా వ్యాక్సిన్ వేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ఆయా వ్యక్తుల వివరాలను నమోదు చేసుకుని ఆన్‌లైన్‌లో అప్‌డెట్ చేస్తున్నారు. శీతాకాలం నేపథ్యంలో టీబీ (క్షయ) ప్రబలకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటుంది. సచివాలయ వ్యవస్థ ద్వారా సర్వే చేయించి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమైంది. జిల్లాలోని 29మండలాల్లో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఎంత మందికి టీకా అవసరమవుతుందనే వివరాలు సేకరిస్తున్నారు. ఎన్ని డోసులు కావాలి, ఎన్ని సిరంజ్‌లు అవసరమవుతాయనే విషయాలపై జిల్లా వైద్యారోగ్యాశాఖ లెక్కలు వేస్తోంది. కరోనా సమయంలో చేపట్టిన విధంగా టీటీటీ(ట్రేసింగ్, టెస్టింగ్, ట్రీట్‌మెంట్) విధానాన్ని ప్రస్తుతం టీబీ నియంత్రణకూ అమలు చేయాలని భావిస్తున్నారు అధికారులు.

వివరాలు నమోదు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీబీ కట్టడికి వివరాలు సేకరిస్తున్నాం. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సహకారంతో వివరాలు పూర్తిగా సేకరించాం. ఆరు కేటగిరి వ్యక్తులను డేటాను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఈ నెల చివరిలో టీకే వేసే కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– అరుణ్‌కుమార్, టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్

ప్రణాళిక ప్రకారం టీకా (బీసీజీ)

తొలుత ఆరు అంశాలు కలిగిన వారికి ప్రాధాన్యతనిస్తూ టీకాలు వేయనున్నారు. 60ఏళ్లు పైబడిన వృద్ధులు, టీబీ బాధితుల కుటుంబ సభ్యులు, టీబీ చరిత్ర కలిగిన వ్యక్తులు, సిగిరెట్ స్మోకర్స్, మధుమేహం బాధితులు, 18కిలోల కంటే తక్కువ బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ) కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇప్పటికే ఆరోగ్యశాఖ పిల్లలకు ఈ టీకా పంపిణీ చేస్తోంది. తొమ్మిది నెలలలోపు పిల్లలకు మూడు డోసులుగా ఈటీకాను వేస్తున్నారు. పుట్టిన ఆరు వారాల వయసులో ఒక డోసు, 14వారాల్లోపు రెండో డోసు, చివరిగా 9నెలల వయసులోగా మూడో డోసు వేస్తున్నారు. మూడు డోసుల టీకా వేసుకున్న పిల్లలకు న్యూమోనియా నుంచి రక్షణ అభిస్తుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఇదే తరహలో నిర్దేశించిన పరిమాణంలో పెద్దలకు కూడా ఈ టీకాలు పంపిణీ చేయాలని వైద్యశాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.

కౌంటర్ కేసులు నమోదు

డోన్ టౌన్ : ఆటోను బైకు ఢీకొనడంతో ఇరువురి మధ్య వాగ్వాదం పెరిగి దాడి చేసుకోవడంతో కౌంటర్ కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. కొండపేటకు చెందిన ఆటో డ్రైవర్ మస్తాన్ తన ఆటోను పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్‌లో నిలుపుకున్నాడు. ఈ నేపథ్యంలో చిగురమానుపేటకు చెందిన వసంతకుమార్, దేవ బైక్‌పై వస్తూ మస్తాన్ ఆటోను ఢీ కోట్టడంతో వాగ్వాదం జరిగింది. మాటమాటా పెరిగి దాడి చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు మస్తాన్‌తోపాటు మరో వర్గంలో వసంతకుమార్, దేవా, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు శోభా యాత్ర

డోన్ టౌన్ : ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించే దిశలో భాగంగా ఆదివారం పట్టణంలో శోభా యాత్ర నిర్వహిస్తున్నామని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మలిశెట్టి జగన్‌మోహన్,కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి తెలిపారు. సాయంత్రం 4.30గంటలకు ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి జాతీర రహదారి సమీపంలోని కొత్త శ్రీగాయిత్రీ పీఠం వరకు శోభా యాత్ర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, కర్నూలు చిన్మయ మిషన్‌కు చెందిన సుప్రేమానంద సరస్వతితో పాటు పట్టణ ప్రముఖుడు, బ్రహ్మశ్రీ కళారత్న శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ హాజరవుతారన్నారు.

రాజీ మార్గం ఉత్తమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి కిశోర్‌కుమార్

బనగానపల్లె రూరల్ : కేసుల పరిష్కారానికి కక్షిదారులు రాజీ మార్గం ఎంచుకోవడమే ఉత్తమమని బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కిశోర్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో మెగా లోక్ అదాలత్ జరిగింది. ఐపీసీకి 33 కేసులు, ఎక్సైజ్ –5, ఓఎస్‌కు 1, ఈపీకి–2, ఎస్‌టీసీ 74 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సామాజిక సేవ కార్యకర్త వెంకటసుబ్బయ్య, న్యాయవాదులు ఆజాంహుస్సేన్, శ్రీనివాసమూర్తి, తులసిశ్వరమ్మ, అల్లావుద్దిన్, శ్రీనువాసులు, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

కోవెలకుంట్ల: లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ సూచించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. కోవెలకుంట్ల, రేవనూరు, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు పోలీస్‌స్టేషన్లకు సంబంధించి రాజీ అయిన సివిల్, క్రిమినల్ కేసులను కొట్టివేశారు. 177 ఎస్టీసీ, 34 ఐపీసీ, 9 అడ్మిషన్, 8 పీఎల్‌సీ, ఒక ఓఎస్ కేసును పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు పేర్కొన్నాయి.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

డోన్ టౌన్ : స్థానిక కోర్టు భవనం ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించింది. కక్షిదారులు రాజీ కావడంతో మొత్తం 606 కేసులును పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి తంగమణి తెలిపారు. ఇందులో పీఎల్‌సీ 12, ఈపీ 3,ఓఎస్ 2, ఐపీసీసీ 114, ఏంసీ 2, డీవీసీ 1, ఎస్‌టీసీ 472 కేసులకు సంబంధించి కక్షిదారులు రాజీ కావడంతో విచారించి వారి సమ్మతి మేరకు కేసులు పరిష్కరించామన్నాని తెలిపారు. కార్యక్రమంలో జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ హనీషా, ప్రిన్స్‌పల్ జూనియర్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని గోర్లగుట్ట, కనుమకింది కొట్టాల గ్రామంలో ఎంపీడీఓ వెంగన్న, ఈఓ ఆర్డీ వెంకటరంగనాయక్, సర్పంచ్‌లు మాదక్క, పార్వతమ్మ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు వెంకిరెడ్డి, గోరుమాను కొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ సోమశేఖర్, ఏపీఓ శేషన్న పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

బనగానపల్లె : అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కుల మతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యనకండ్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడూరు రామచంద్రారెడ్డి అధ్యక్షతన శనివారం వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మీ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబశివారెడ్డి, శంకర్‌రెడ్డి మద్దిలేటిరెడ్డి సంజీవ గౌడ్, బోయగోపాల్ కోట్టాల మధు శ్రీధర్ రెడ్డి కోడూరు వెంకటసుబ్బారెడ్డి ఈశ్వర్‌రెడ్డి సిద్దయ్య రవితేజాలతో పాటు ఎంఎల్‌ఓలు మధుసుధాకర్,రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాలకు చెందిన ఫ్లెక్సీతోపాటు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. తదనంతరం ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు.



యనకండ్లలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చెన్నుపాటి లక్ష్మయ్య సేవలు చిరస్మరణీయం

డోన్ టౌన్ : ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం కృషి చేసిన యోధుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి తెలిపారు. ఆయన వర్థంతి పురష్కరించుకుని స్థానిక కార్యాలయంలో శనివారం మండలశాఖ గౌరవ అధక్షుడు సంజీవరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెన్నుపాటి చిత్ర పటానికి ఉపాధ్యాయులతో కలిసి వారు పూల మాలలు వేసి నివాళుర్పించారు. చెన్నుపాటి లక్ష్మయ్య సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా నాయకులు లబ్బుల్ లతీఫ్, లక్ష్మీకాంతరెడ్డి, ఉపాధ్యాయులు అంజనప్ప, సుమన్, ప్రసాద్, సంజీవరాయుడు, చంద్రమోహన్, సర్వజ్ఞమూర్తి, అబ్దుల్‌కలాం, ఆజాద్, సాలయ్య పాల్గొన్నారు.



చెన్నుపాటి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చురుగ్గా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొలిమిగుండ్లలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సరిపడా తాగునీటి సరఫరా అందకపోవడంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవతో జల్‌జీవన్ కింద రూ.కోటి రూపాయలకు పైగానే మంజూరు చేయించారు. పీహెచ్‌సీ వెనుక భాగాన, నాలుగు గూళ్ల ఆలయ ఆవరణలో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఒక్క ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉన్న కారణంగా నీటి సరఫరా సమయంలో జాప్యం చోటు చేసుకుంటుంది. ప్రస్తుతం జరుగుతున్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల పనులు పూర్తి అయితే తాగునీటి సమస్య తలెత్తే పరిస్థితి ఉండదు.



కొలిమిగుండ్లలో నిర్మిస్తున్న ట్యాంక్

భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటయ్య క్షేత్రం



ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, (ఇన్‌సెట్)ప్రత్యేక అలంకరణలో శ్రీ మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం కార్తీక మాసం చివరి శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాలను నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వేకువ జాము నుంచే భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాంలకరణ, వరపూజ, మహామంగళహరతి ఇచ్చారు. ఆలయ ఆవరణంలో మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

గుండం ఆంజనేయస్వామికి పోటెత్తిన భక్తులు

కొలిమిగుండ్ల: కార్తీక మాసం కడ శనివారం కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో కొలువైన ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. రాయచోటి చెక్క భజన కళాకారుల బృందం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పులి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు పులి పెద్దిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, నారాయణరెడ్డి, రామనాథ రెడ్డి, రామసుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఓబయ్య, కొండయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఘనంగా పావననరసింహస్వామి కల్యాణం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన శ్రీ చెంచులక్ష్మీ సమేత పావన నరసింహస్వామి కల్యాణం ఆలయ వ్యవస్థాపకులు అర్చకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. ఉదయం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను వధువరులుగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చరణలతో సంప్రదాబద్ధంగా కల్యాణం జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానానికి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎన్ రంగాపురం వద్ద శనివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్న ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డారు. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఆరేపల్లి మనోహర్ (34) అరుణాచల ట్రాన్స్‌పోర్టులో పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. ఎన్ రంగాపురం వద్దకు రాగానే ఏపీ05 సీఈ 7077 నంబర్ కారు పంక్చర్ కావడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం మనోహర్ కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

పెట్ క్లినిక్ ప్రారంభం

డోన్ : స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ కేఎల్ఎన్ రాజు కంటి ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన పెట్ క్లినిక్‌ను శనివారం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు యజమానులు క్రమం తప్పకుండా డీవార్మింగ్ చేయించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జంతువులకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

నేడు ఆవోపా కార్తీక మాస వనభోజనాలు

డోన్ టౌన్ : ఆర్యవైశ్య సంఘీయులకు ఆవోపా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇతర ప్రాంతాలకు చెందిన ప్రముఖులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఉడుములపాడు గ్రామ సమీపంలోని చింతలకృష్ణ తోటలో వన భోజనాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం ఉసరిక చెట్టుకు పూజలు, గోపూజ, జ్యోతి ప్రజ్వలన తదితర ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఆర్యవైశ్యులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు సైన్స్ ఎగ్జిబిషన్

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల్లో ఆదివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ గీతా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ ప్రభాకర్ ప్రారంభించే ఎగ్జిబిషన్‌లో మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యార్థులు పాల్గొన్నాలని సూచించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను అనుమతించినట్లు ఆమె తెలిపారు.

బలిజ కాపుల సంక్షేమానికి పెద్దపీట

బనగానపల్లె రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలిజ కాపుల సంక్షేమానికి పెద్దపీట వేశారని, అదేవిధంగా తమవంతు చేయూతనిస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకవన భోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. బలిజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, వారి విన్నపం మేరకు కోవెలకుంట్లలో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం ఇటీవలనే ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అదేవిధంగా అవుకు పట్టణంలో బలిజ కులస్తులకు రూ.1.30 కోట్లతో ప్రత్యేక కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. బనగానపల్లెలోనూ బలిజ సంఘస్తులు ఐకమత్యంగా ముందుకొస్తే ప్రత్యేక కళ్యాణ మండప, రాయల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. పట్టణంలో ఎస్ఆర్‌బీసీ నుంచి జీఎం టాకీస్ వరకు కొత్తగా నిర్మించిన పోర్‌లైన్స్ రోడ్డు సెంటర్‌లో శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుకు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివ రామయ్య, శ్రీ కృష్ణదేవరాయ కాపు బలిజ సేవా సంఘం నాయకులు పుల్లయ్య, సుబ్బారావు, ఎస్ మహేష్, కిశోర్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, ఎయిటెల్ మనోహర్, మనోజ్, భాస్కర్, బాలిశ్వరయ్య, నీలి శ్రీనివాసులు, రామసుబ్బయ్య, రామసుబ్బారెడ్డి రామన్న, రవి, తిరుమలేష్, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు ప్రతిపాదనలు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీవాసులు, విద్యార్థులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్, రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్, రైల్వే జీఎం ఆదేశాల మేరకు తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, డోన్ రైల్వే అసిస్టెంట్ ఇంజనీర్ పాపరావు, డబుల్ లైన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్ రావు , సీనియర్ సెక్షన్ ఇంజనీర్ లక్ష్మీకాంత రెడ్డి ఫుట్ వేర్ బ్రిడ్జిల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ప్రతిపాదనులు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ మునిస్వామి, సర్వేయర్ అన్నారావు, కాలనీవాసులు తిరుమలేశ్వర్‌రెడ్డి, రామనాయుడు, నిరంజన్ పాల్గొన్నారు.



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్, నగర పంచాయతీ చైర్మన్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని చిన్నమల్కాపురం ఫీడర్ పరిధిలోని 33 కేవీ లైన్ పనుల నేపథ్యంలో మల్కాపురం, రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయరంగానికి త్రీఫేస్ కరెంటు ఉదయం 5 నుంచి 12 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

ఇంటి విషయంలో ఘర్షణ

కోవెలకుంట్ల: పట్టణంలోని సీతారామ నగర్‌లో ఇంటి విషయంలో శనివారం ఘర్షణ చోటు చేసుకుంది. మొదటి భార్యపై భర్తతోపాటు రెండవ భార్య దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ మౌలానీ సమాచారం మేరకు.. కాలనీలో ఉంటున్న నందకుమార్ వెల్దుర్తికి చెందిన అరుణను వివాహం చేసుకున్నాడు. ఈమెకు తెలియకుండా పదేళ్ల క్రితం పద్మావతిని రెండవ వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలకు చెందిన పెద్దలు రాజీ కుదిర్చి అరుణకు ఇల్లు రాసిచ్చేలా పంచాయతీ చేశారు. ఇటీవల తిరిగి ఆ ఇంటిని నందకుమార్ మరోకరికి రాసివ్వడంతో ఈ విషయంపై వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో అరుణపై భర్త, తల్లి లీలావతి, రెండవ భార్య పద్మావతి దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై 324, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.